క్లుప్తంగా

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 16వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ డాక్టర్ జయరాం మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఫాగింగ్, మురుగునీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ పిచికారి చేయడం లాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ ఔదార్యం



ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామ వలంటీర్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన బద్రి పాల్‌రాజు అనే 12ఏళ్ల దివ్యాంగ బాలుడికి పింఛన్ మంజూరైంది. అయితే పాల్‌రాజు అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ దాసరి జ్యోతి శుక్రవారం అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేసింది. లబ్ధిదారులకు సకాలంలో సాయం అందాలనే తలంపుతో సుమారు 100 కిలోమీటర్ల దూరంలోని గుంటూరు వెళ్లి పింఛన్ అందజేసిన జ్యోతిని గ్రామస్తులు అభినందించారు.

పేట అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి



జగ్గయ్యపేట: పట్టణాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వార్డులో దోమల నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు డ్రైన్‌ల నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి విశేష కృషి



బండిపాలెం(జగ్గయ్యపేట): ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ముస్లింలంతా అండగా ఉండాలని జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ పిలుపునిచ్చారు. హర్‌దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని మసీదులో ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనార్టీల కోసం నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు మంత్రి పదవితోపాటు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారన్నారు. వైఎస్సార్ షాదీ తోఫా పథకంతో రూ. లక్ష అందిస్తూ ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నందున ఆయన ప్రభుత్వానికి అండగా ఉండాల్సిన బాధ్యత ముస్లింలపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీదు గురువు సయ్యద్ బాలసైదా, మత పెద్దలు షబీద్, అబ్దుల్ మౌలాలి, నాయకులు రస్ హుస్సేన్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్..గుమ్మడిదూర్రు

- రూ.2.10కోట్లతో అభివృద్ధి పనులు
- సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్ ఏర్పాటు
- మారిన పాఠశాలల రూపురేఖలు

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదూర్రు గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో గుమ్మడిదూర్రులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాలల అభివృద్ధి, మంచినీటి వసతి, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు ఇలా ప్రజలకు అవసరమైన మౌలికవసతులు కల్పించారు. నాడు–నేడు పథకంలో భాగంగా రూ.40లక్షలతో చేపట్టిన రెండు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారు.

రూ.40లక్షలతో సచివాలయం..

గుమ్మడిదూర్రులో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించగా, పొలిమేర దాటకుండానే సచివాలయం ద్వారా అన్నిరకాల పథకాలు, సర్టిఫికెట్లు, సేవలను గ్రామస్తులు పొందగలుగుతున్నారు. రూ.21 లక్షలతో రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే), రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలోని రెండు పాఠశాలలకు నాడు–నేడు పథకం కింద ఒక్కొక్కదానికి రూ.20లక్షల చొప్పున మొత్తం రూ.40లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఈ నిధులతో చేపట్టిన పనులతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో పాఠశాల విద్యార్థులకు వసతులు కల్పించారు.

రూ.22 లక్షలతో సొసైటీ భవనం..

రూ.22లక్షలతో రైతులకు విశేష సేవలందించే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనాన్ని నిర్మించారు. వీటితో రూ.25లక్షలతో సీసీ రోడ్లు, రూ.7లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ.10 లక్షలతో ఇందిరమ్మ మోడల్ కాలనీకి వెళ్లే దారిలో పంట కాల్వపై రెండు కల్వర్టుల నిర్మాణం చేశారు. తాగునీటి పైపులైన్ నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.7లక్షలు మంజూరు కాగా, ప్రస్తుతం ఆ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. గుమ్మడిదూర్రు, పంచాయతీలోని వెల్దుర్తిపాడులో ఒకొక్కటి రూ.14లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావచ్చింది. ఇలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలను కేటాయిస్తూ మౌలికవసతులు కల్పిస్తోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్నిరకాల ప్రభుత్వసేవలతోపాటు సంక్షేమ పథకాలను సైతం ఎటువంటి సిఫార్సు లేకుండా కులమతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అందుతున్న వైనంపై గుమ్మడిదూర్రు పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉంటామని వారు చెబుతున్నారు.



ఆధునిక వసతులతో కూడిన ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల



రైతులకు సేవలందిస్తున్న సొసైటీ భవనం



రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం



నిర్మాణంలో ఉన్న హెల్త్ సెంటర్

గతంలో లేని అభివృద్ధి..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గతంలో ఎన్నడూలేని విధంగా గుమ్మడిదూర్రు పంచాయతీలో అభివృద్ధి పనులు జరిగాయి. ఆర్బీకే, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు తుదిదశకు చేరాయి. ఇంటిస్థలం ఉన్న వారికి రాష్ట్రప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం నిధులు కేటాయించడంతో 30మంది గ్రామస్తులు సొంతిళ్లు కట్టుకున్నారు. ఇందిరమ్మ మోడల్ కాలనీకి వెళ్లేందుకు మార్గంలోని పంటకాల్వపై రెండుచోట్ల కల్వర్టు నిర్మాణం కూడా పూర్తయింది. పేదల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండటం బాధ్యత అని గ్రామస్తులు చెబుతుండటం గర్వంగా ఉంది.

నక్కా కమల,
సర్పంచ్

6నుంచి ఏఎంసీల్లో పత్తి కొనుగోళ్లు

నందిగామ: ఈనెల ఆరోతేదీ నుంచి స్థానిక ఏఎంసీలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగుతాయన్నారు. పత్తిని విక్రయించుకోవాలనుకునే రైతులు ముందుగా సంబంధిత గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, యార్డుకు పత్తిని తీసుకురావాలని సూచించారు.

కంచికచర్లలో

కంచికచర్ల : కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని రైతులకు సంబంధించిన పత్తి కొనుగోళ్లను ఈనెల 6వ తేదీన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా చేపడతారని ఏఎంసీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పత్తి రైతులు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోళ్లు చేపడతారని వివరించారు. పూర్తి వివరాల కోసం ఏఎంసీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వీరులపాడు: జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి నూరు శాతం ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ మణికుమార్ సూచించారు. మండలంలోని బోడవాడ, చెన్నారావుపాలెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని, పనిప్రాంతంలో మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. సమావేశంలో సర్పంచ్‌లు శీలం సంధ్య, పత్తిపాటి మల్లికార్జునరావు, బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏపీవో జనార్దన్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నా



చెవిటికల్లులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో పంపు సెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చెవిటికల్లు(కంచికచర్ల) : నందిగామ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో మౌలికవసతులు కల్పిస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. ఇందుకు అవసరమైన కోట్లాది రూపాయల నిధులను సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేస్తోందని ఆయన వివరించారు. మండలంలోని చెవిటికల్లులో మురుగునీరు పారుదల కోసం రూ.16లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానన్నారు. కులమతాలకతీతంగా అందరి అభ్యున్నతి, అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని పల్లెలు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయని గుర్తుచేశారు. డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మయ్య వాగు వంతెన పనులను ఈనెల 15నుంచి చేపడతామని చెప్పారు. చెవిటికల్లు, బత్తినపాడు పైలెట్ ప్రాజెక్టుల ద్వారా కృష్ణానది నుంచి అన్ని గ్రామాలకు మంచినీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కంచికచర్ల, వీరులపాడు మండలాలకు నిత్యం మంచినీరు సరఫరా అయ్యేలా అధికారులు ముందుచూపుతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు వెలగలేటి మాధవి, బండి మల్లికార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుడ్డి సత్యనారాయణ, నాయకులు వెలగలేటి బాబు, వాసు, మంగలపూడి కోటిబాబు, పరిటాల రాము, సత్యం, నాగుల్‌మీరా, మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, మోహనరావు, కార్యదర్శి మీర్జావలి పాల్గొన్నారు.

రైతుబాంధవుడు సీఎం జగన్..

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తూ రైతు బాంధవునిగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. జలకళ పథకం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల రైతులకు మంజూరైన మోటార్లు, పంపుసెట్లను జుజ్జూరులో శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయటంతోపాటు రైతు సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. సీఎం జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం జలకళ పథకం ద్వారా సన్న,చిన్నకారు రైతుల వ్యవసాయ భూముల్లో ఉచితంగా బోరు వేస్తుండటంతో బీడు భూములు సైతం పచ్చని పంట పొలాలుగా మారుతున్నాయని చెప్పారు. వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా వ్యవసాయ సీజన్‌కు ముందే పెట్టుబడి ఖర్చులకు నగదు అందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను రాయితీపై అందించడంతోపాటు సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

రైతులు జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయి, పీఏసీఎస్ చైర్మన్లు పూలా రాంబాబు, కోట రామారావు, ఏపీవో జనార్దన్, ఎంపీడీవో అరుంధతీదేవి, నాయకులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు సేవలపై కళాజాత

గౌరవరం(జగ్గయ్యపేట): సహకార బ్యాంకులు అందించే రుణాలను రైతులు, డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ అన్నాబత్తుల శ్రీనివాసరావు సూచించారు. గ్రామంలోని సొసైటీ వద్ద శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, డ్వాక్రా మహిళలకు బ్యాంకు పలు రుణాలను అందిస్తుందన్నారు. రుణాలతో పాటు ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నట్లు వివరించారు. జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజనపై కళాజాత సభ్యులు ప్రసాద్, సుబ్బరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా బండిపాలెంలో కూడా కళాజాత కార్యక్రమం నిర్వహించారు.



గౌరవరంలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగనవాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగమణి శుక్రవారం కోరారు. అంగనవాడీ కార్యకర్త పోస్టులు జగ్గయ్యపేట మండలం పోచంపల్లి -1 సెంటర్(ఓసీ), షేర్‌మహ్మద్‌పేట-1 సెంటర్(బీసీ–ఈ), పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు (ఓసీ)లకు కేటాయించినట్లు చెప్పారు. చిల్లకల్లు-9 సెంటర్, షేర్‌మహ్మద్‌పేట-4సెంటర్‌లోని ఆయా పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు ఈనెల పదోతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వత్సవాయి: మండలంలోని వత్సవాయి–7 సెంటర్, పోలంపల్లి–2 సెంటర్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వత్సవాయి–7సెంటర్‌లోని పోస్టుకు బీసీ–ఎ, పోలంపల్లి–2 పోస్టుకు ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తగిన ధ్రువీకరణపత్రాలతో ఈనెల 10వతేదీ సాయంత్రం ఐదుగంటలల్లోగా చిల్లకల్లులోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీవో సూచించారు.

సమస్యల పరిష్కారానికి నిధులు

వీరులపాడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఆయా నిధులతో గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహరావు తెలిపారు. మండలంలోని చెన్నారావుపాలెం, జుజ్జూరు, నరసింహారావుపాలెంల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తనదృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. గ్రామాల్లో చేపట్టిన పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్‌లు బొమ్మిశెట్టి దుర్గాదేవి, పత్తిపాటి మల్లికార్జునరావు, రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

యువకుడిపై దాడికేసులో ఆరుగురి అరెస్ట్

కంచికచర్ల : ఇటీవల కంచికచర్లకు చెందిన యువకుడు కె.శ్యామ్‌కుమార్‌ను కారులో ఎక్కించుకుని ఆరుగురు వ్యక్తులు దాడి చేసిన కేసులో నిందితులందరినీ అరెస్ట్ చేసినట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్.హరీష్ తోపాటు నిందితులు జి.అనిల్, ఎస్.విష్ణు, బి.శ్రీకాంత్, నాగార్జున, లక్ష్మీనారాయణలను అరెస్ట్ చేసినట్లు వివరించారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన

అంతకుముందు బాధితుడు శ్యామ్‌కుమార్‌పై దాడి చేసిన ఆరుగురిని అరెస్ట్ చేసి బాధితుడికి న్యాయం చేయాలంటూ స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో దళిత సంఘాలు శుక్రవారం ఉదయం ఆందోళన చేశాయి. బాధితుడు శ్యామ్‌కుమార్‌కు మెరుగైన వైద్యం అందించడంతోపాటు దాడికి పాల్పడిన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గణపవరానికి చెందిన హరీష్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీసీపీ మోకా సత్తిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులతో మాట్లాడి నిందితులను వెంటనే అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. బాధితుడికి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు.



బాధితుడు శ్యామ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్

పరామర్శించిన ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్..

ఆరుగురు వ్యక్తులు దాడి చేయడంతో గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు కె.శ్యామ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్యామ్‌కుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దళిత యువకుడిని కొంతమంది యువకులు దారుణంగా కొట్టడం బాధాకరమన్నారు. ఈ దాడిని పూర్తిగా ఖండిస్తున్నానన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులకు సూచించారు. బాధితుడికి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. బాధితుడిని పరామర్శించిన వారిలో సర్పంచి వేల్పుల సునీత, సీఐ నాగేంద్రకుమార్ ఉన్నారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ



కంభంపాడు(వత్సవాయి) : గ్రామ పరిధిలో ఉన్న ముత్యాలమ్మ గుడిలో శుక్రవారం చోరీ జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామశివారులోని గుడిలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టడంతోపాటు గంటలను దొంగిలించారు. ఘటనను గమనించిన గ్రామస్తులు ఈ మేరకు సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు.

16న హుండీ లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు ఈవో జయప్రకాష్‌బాబు శుక్రవారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తిగల భక్తులు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు.

ముగ్గురికి గాయాలు

జుజ్జూరు(వీరులపాడు): ఓప్రైవేట్ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు కంచికచర్లకు చెందిన ప్రైవేట్ బస్సు మండలంలోని అల్లూరు నుంచి కంచికచర్ల వైపు వెళ్తుండగా, పెద్దాపురం నుంచి కంచికచర్ల వెళ్తున్న ఆటో జుజ్జూరు గ్రామశివారులోని అట్టల ఫ్యాక్టరీ వద్ద బస్సు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే ఉన్న ఆటో వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ షేక్ బాజీతోపాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్సీ పరామర్శ..

నందిగామ టౌన్: వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామ శివారులో ప్రైవేట్ బస్సు ఆటో ఢీకొన్న ఘటనలో గాయపడి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యంఅందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను పరామర్శించినవారిలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు కూడా ఉన్నారు.

మంచినీటి పైపులైన్ పరిశీలన

జగ్గయ్యపేట: పట్టణంలోని వెంకటగిరి గుట్టలోని రిజర్వాయర్ ప్రాంతాన్ని జగ్గయపేట మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ నుంచి పట్టణంలోని ఏడు వార్డులకు నీరు సరఫరా అవుతోందన్నారు. అయితే ఈ ప్రాంతంలో పైపులైన్‌కు లీకులు ఏర్పడి నీరు కలుషితమవుతోందని పట్టణ ప్రజలు సమస్యను తమదృష్టికి తీసుకురావడంతో పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే నీటిని పరీక్షించడంతోపాటు యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు కూడా చేపడతామని తెలిపారు.

